

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## దగ్గరి కొండలు

**"అక్కా! ఎక్కడున్నావ్?** అర్జెంట్‌గా రావాలి" ప్రతిమ పెద్దగా అరిచింది.

పిన్నితో కబుర్లు చెప్తున్న నేను దాని అరుపుకి ఉలిక్కిపడి లేచి బాల్కనీలోకి వెళ్ళాను.

"అడుగో. ఆ బ్లూ షర్ట్ అబ్బాయ్‌ని చూడు. ఎలా ఉన్నాడు?" అడిగింది. వీధిలో నడుస్తూ వెళ్తున్న ఆ యువకుడ్ని చూసాను. బానే ఉన్నాడు. చేతిలో ఏదో పుస్తకం ఉంది. పక్కనే నడుస్తున్న మరో యువకుడితో కబుర్లు చెప్తూ వెళ్తున్నాడు. అతను కాని, అతని పక్కనున్న వ్యక్తి కాని తలెత్తి మా వైపు చూడలేదు.

"ఎవరతను? మీ క్లాస్‌మేటా?" ప్రతిమని తేరిపార చూస్తూ అడిగాను.

"ఛీ కాదు. మా ఫిజిక్స్ లెక్చరర్. బాగున్నారు కదూ?" అడిగింది.

"పర్సనాలిటీ బానే ఉంది. ముఖం సరిగా చూడలేదు. నేనొచ్చేసరికే దాటిపోయారు" చెప్పాను.

"ఆయన పేరు సాత్యకి. ఎంత తెలివైనవారో. ఫిజిక్స్‌లో పిహెచ్‌డి అంటే మాటలా చెప్పు? లెసన్స్ ఎంత బాగా చెప్తారో" కళ్ళు మిలమిల మెరుస్తూండగా చెప్పింది.

"ఎందుకే కొంప మునిగినట్లు గావుకేకలు వేస్తున్నావ్?" పిన్ని బాల్కనీలోకి వస్తూ అడిగింది.

"అబ్బే! ఏం లేదమ్మా, మన గులాబీకి మొగ్గ వచ్చిందని అక్కని పిలిచి చూపిస్తున్నాను" ప్రతిమ మాటమార్చింది.

"ప్రతిమా మీ సర్‌కి బండి కూడా లేదు. కొంచెం పేదవాళ్ళనుకుంటా" ఆ రాత్రి ప్రతిమ గదిలో పడుకున్న నేను కావాలనే అడిగాను.

"ఛఛ! వాళ్ళిల్లు మనింటికి నాలుగైదు ఇళ్ళ అవతలే. కాలేజ్‌కి వాకింగ్ డిస్టన్స్ అందుకని నడిచే వస్తారు. హీ ఈజ్ సో సింపుల్" తన్మయత్వంగా చెప్పింది.

సాధారణంగా పిల్లలకి టీచర్ల మీద ఉండే క్రష్ లాంటిది కాకుండా ప్రతిమకి ఇంకా ఏదో ఉందని అర్థమైంది. ఇంకా అతని గురించి మాట్లాడితే ఆమెని ప్రోత్సహించినట్లవుతుందని టాపిక్ మార్చాను.

మా వారు ఆఫీస్ పనిమీద సౌత్ కొరియా వెళ్ళడంతో నేను ఓ పదిరోజులుండిపోదామని పిన్ని వాళ్ళింటికి వచ్చాను. నాకంటే రెండేళ్ళు చిన్నదైన ప్రతిమ యం.యస్సీ చదువుతోంది. నాకు చదువు పెద్దగా అబ్బక డిగ్రీతో ఆపేసి హౌస్ వైఫ్‌గా హాయిగా టివి చూసుకుంటూ, కొత్త వంటలు నేర్చుకుంటూ గడిపేస్తున్నాను. నాకు చదువులేకపోయినా లోకజ్ఞానం చాలా ఉందని నా నమ్మకం.

"ఈ సంవత్సరంతో ప్రతిమ చదువైపోతుంది. మీ అత్తగారివైపు ఎవరైనా మంచి అబ్బాయి ఉన్నాడేమో చూడవే. పెళ్ళిచేసి పంపిస్తే, అతనెక్కడ ఉద్యోగం చేస్తూంటే, అదీ అక్కడే జాబ్ వెతుక్కుంటుంది" పిన్ని కాఫీ ఇస్తూ చెప్పింది.

"అది ఎవరినైనా ప్రేమించిందేమో అడిగావా పిన్నీ?" గ్లాస్ అందుకుంటూ అడిగాను.

పిన్ని ముఖంలో ఆందోళన కనిపించింది.

"కొంపతీసి నీకేమైనా చెప్పిందా?" అపనమ్మకంగా అడిగింది.

"లేదు. పి.జి చదువుతుందిగా. స్నేహాలు కొంతదూరం వెళ్ళాయేమో అని" నసిగాను.

పిన్ని ఓ కుర్చీని నాకు దగ్గరగా జరుపుకుని కూర్చుని గొంతు తగ్గించి చెప్పింది.

"నాకూ ఆ అనుమానం ఉందే నీలూ. మీ బాబాయ్ సంగతి తెలుసుగా పరమ చాదస్తం మనిషి. ఈ పిల్ల ప్రేమా, దోమ అన్నదంటే, మా ఇద్దర్నీ నరికి పోగులు పెడ్తాడు. ఇదెక్కడ కొంప ముంచుతుందో అని భయపడి చస్తున్నాను. నీలాగా చక్కగా పెద్దవాళ్ళు చూసిన సంబంధం చేసుకుని అటువైపు వాళ్ళు ఇటువైపు వాళ్ళతో ఆనందంగా ఉండక ఎందుకొచ్చిన ప్రేమలు చెప్పు?"

పిన్ని బాధ నాకు అర్థమైంది కాని ప్రతిమ ఆ ఫిజిక్స్ లెక్చరర్‌ని ప్రేమించిందేమోనని నాకు అనుమానంగానే ఉంది.

ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పాను.

"మా వారి బాబాయ్ కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పిన్ని. అమెరికాలో ఉంటాడు. కాకపోతే ఇరవై ఏడేళ్ళు ఉంటాయి. ప్రతిమకంటే ఐదేళ్ళు పెద్ద మరి. ఇందాక మా అత్తగారితో మాట్లాడాను. చాలామంచి అబ్బాయి అని చెప్పారు."

పిన్ని మొహం వికసించింది.

"నీలిమ అత్తగారి తరపువాళ్ళంతా ఎంత పద్ధతిగా, సంస్కారవంతంగా ఉన్నారో పెళ్ళిలో చూసాం కదండీ. ఏమంటారు?" బాబాయ్‌ని అడిగింది.

"ఐదేళ్ళ గేప్ అంటే ఈ కాలం అమ్మాయిలు ఒప్పుకోవడంలేదు మరి. ప్రతిమ ఏమంటుందో" ఆయన కూతురివంక చూసాడు.

ప్రతిమ తలవంచుకుని నిశ్శబ్దంగా అన్నం తింటోంది. ఏమీ మాట్లాడలేదు.

ఆ రాత్రి తన బెడ్ రూంలోకి వెళ్ళగానే కోపంగా నా గొంతు పట్టుకుని అరిచింది.

"మా సాత్యకిగారి గురించి చెప్పాక కూడా నువ్వు పెళ్ళి సంబంధాలు చెప్తావేంటే?"

నేను దాని చేతులు వదిలించుకుని అమాయకంగా అడిగాను.

"ఏం చెప్పావు? బాగా పాఠాలు చెప్తాడు, ఫిజిక్స్‌లో డాక్టరేట్ అంటే ఎంత తెలివైనవాడు అన్నావు. అంతేగా?"

"నీకు అంతవరకే అర్థమైందా? ఐ లవ్ హిమ్. నువ్వీ పెళ్ళిళ్ళ పేరక్క వేషాలు మానెయ్. నేను అతన్నే చేసుకుంటాను."

"కాని అతను నిన్ను ప్రేమించడంలేదుగా?" అడిగాను.

"నీకెలా తెలుసు?"

"ప్రేమిస్తే మరి ప్రేయసి ఇంటిమీంచి వెళ్ళేప్పుడు తలెత్తి ఆమె కోసం చూడరా? ఎన్ని పుస్తకాలు చదవలేదు?"

ప్రతిమ నవ్వేసింది.

"నిజమేనే. ఆయనకింకా తెలీదు. ఇంకో సెమిస్టర్ ఉందిగా. ఈలోగా చెప్తామని."

"కానీ ప్రతిమా ఈ రోజుల్లో అమ్మాయిలంతా సాఫ్ట్‌వేర్, విదేశాలు అంటున్నారు. మిడిల్‌క్లాస్ లైఫ్ గడపగలవా?" అనుమానంగా అడిగాను.

"అంతా ఇంజనీర్లు, డాక్టర్లనే చేసుకుంటే మరి వీళ్ళందరికీ పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి? నేను హేపీగానే ఉంటాను. అమ్మవాళ్ళింటికి నాలుగిళ్ళ అవతల ఉండటం ఎంత అదృష్టం?"

"నువ్వు ప్రాక్టికల్‌గా ఆలోచించడం లేదు ప్రతిమా. తెలివి చదువులోనే కాదు. జీవితంలో కూడా ఉండాలి. అమ్మా నాన్నలని ఏడిపించి పెళ్ళి చేసుకునేంత ప్రేమ నీలో ఉందని నేను అనుకోను. కేవలం పట్టుదలే. అసలు అతని మనసులో ఏముందో తెలుసుకో ముందు" హితబోధ చేసాను. ఆ తర్వాత నేను మా ఊరు వెళ్ళిపోయాను.

పదిరోజుల తర్వాత నాకు ప్రతిమనించి వాయిస్ మెసేజ్ వచ్చింది.

"మా సాత్యకిగారికి మొత్తానికి నా ప్రేమ గురించి చెప్పాను. తెల్లబోయారు పాపం. తన రీసెర్చ్, పాఠాలు తప్ప మరోటి తెలీని ఆ అమాయక జీవి విషయం జీర్ణించుకోడానికి చాలా కష్టపడ్డారు. 'నేను పెళ్ళి చేసుకోవాలని అనుకోవడంలేదు' అని గొణిగారు. 'ఎప్పుడు అనుకుంటే అప్పుడే చేసుకోండి వెయిట్ చేస్తా' అన్నాను.

'లేదు. లేదు అసలు లైఫ్‌లో పెళ్ళి చేసుకోవాలని లేదు' అన్నారు.

'మరి నేనేమైపోవాలి?' అని అడిగాను.

ఆ మాటకి సార్ ఎలా చూసారో తెలుసా నీలూ? అచ్చం జీసస్‌లా చల్లగా, ప్రేమ కురిపిస్తూ చూసారు. ఆ తర్వాత క్లాస్‌లో ఆయన నామీదే దృష్టి నిలిపి పాఠాలు చెప్పడం మొదలు పెట్టారు.

అదృష్టం ఏమిటంటే వాళ్ళది మన కులమే. మా నాన్నకి సగం అభ్యంతరం పోతుంది. కాని పెద్దగా ఆస్తిపాస్తులున్నవాళ్ళు కాదు. అందుకు నాన్న ససేమిరా ఒప్పుకోరు. నన్నో కోటీశ్వరుడికిచ్చి చేయాలని ఆయన కోరిక. నా చిచ్చి బుజ్జి బంగారు సాత్యకి తప్ప మరెవరూ నాకు నచ్చరు - వద్దు కూడా. సార్‌ని పెళ్ళికి సంసిద్ధం చేస్తున్నా. తర్వాత అమ్మావాళ్ళకి చెప్తా, నువ్విదంతా బావకి కూడా చెప్పకు ప్లీజ్. టాటా. అన్నట్లు ఆయనవి ఎంత పెద్దకళ్ళో తెలుసా? అచ్చం బుద్ధ భగవానుడి కళ్ళలా దయగా ఉంటాయి. ఆ బంగారం నా సొంతం అంటే ఎంత హేపీగా ఉందో అక్కా"

ఇదంతా నాకెంతో అయిష్టంగా అనిపించింది. ఏం మాట్లాడలేక ఒక స్మైలీ బొమ్మ పంపి ఊరుకున్నాను.

ఆ తర్వాత పిన్ని వాళ్ళింట్లో యుద్ధాలు జరిగాయి. ప్రతిమ పట్టు వీడలేదు. బాబాయ్ అరుపులు, కేకలు, పిన్ని ఏడుపులు దాన్ని కదిలించలేకపోయాయి. ప్రతిమ పెళ్ళికి నేనుకూడా వెళ్ళాను. సాత్యకి నెమ్మదైనవాడు. మంచివాడు అని తెలిసిపోతుంది. ఆ మాటే పిన్నితో చెప్పాను.

"దీని అదరగండానికి తగినట్లు నోట్లో నాలిక లేనివాడ్ని ఎంచుకుంది" పిన్ని కోపంగా చెప్పింది.

ప్రతిమ పెళ్ళయిన రెండు నెలలకే మా వారి ఉద్యోగ రీత్యా మేం అమెరికా వెళ్ళిపోయాం. ఆ తర్వాత ప్రతిమ నించి ఎలాంటి ఫోన్ కానీ, మెసేజ్ కానీ రాలేదు. 'కొత్త సంసారం' అని నవ్వుకున్నాను.

మూడేళ్ళ ప్రాజెక్ట్ అవగానే ఇండియాలో పాత ఉద్యోగంలోకి వచ్చేసాం. నేను తీరిగ్గా బంధువుల ఇళ్ళు తిరుగుతూ మా ఏడాది కొడుకుని చూపించి అమెరికా కబుర్లు చెప్పాలని ముందు అమ్మ దగ్గరకి వెళ్ళాను. రెండు రోజులున్నాక ఇద్దరం కలిసి పిన్ని వాళ్ళ ఊరు వెళ్ళాం. నన్ను చూస్తూనే పిన్ని ఆనందంగా కౌగిలించుకుని బాబుని ఎత్తుకుని ముద్దు పెడుతూ చెప్పింది.

"ఏ వయసుకి ఆ ముచ్చట. నీ పెళ్ళి, పిల్లాడు అన్నీ సక్రమంగా టైంకి జరిగాయి"

"పిన్నీ ప్రతిమ ఎలా ఉంది? నేనొస్తున్నట్లు మెసేజ్ చేసాను. అది ఇక్కడికి వచ్చి నా కోసం ఎదురు చూస్తుందనుకున్నా" నిష్ఠూరంగా చెప్పాను.

"దాని గురించి ఏం చెప్పాలి నీలూ. ఎందుకో సడన్‌గా మాతో మాట్లాడటం మానేసింది. పిల్ల నాలుగిళ్ళ అవతల ఉందన్నమాటేగాని చూసి మూడు నెలలు దాటింది" పిన్ని విచారంగా చెప్పింది.

ఆ సాయంత్రం బాబుకి స్నానం చేయించి, నేను తయారై అమ్మకి చెప్పి, ప్రతిమ ఇంటికి బయలుదేరాను.

తలుపు తట్టిన వెంటనే తీసింది. అప్పుడే ఆఫీస్ నించి వచ్చినట్లుంది.

"నువ్వేనని ఎక్స్‌పెక్ట్ చేసా" నవ్వుతూ చెప్పింది.

"ఎలా ఉన్నావే? ఒక్క కబురూ లేదు నీనించి" సోఫాలో కూర్చుంటూ చెప్పాను.

"ఏమో అక్కా ఎవరితో మాట్లాడాలనిపించడంలేదీ మధ్య" నిర్లిప్తంగా చెప్పింది.

"ప్రతిమా ఏమైందే నీకు? పిన్నితో కూడా మాట్లాడడం లేదట. ఎందుకిలా?"

ప్రతిమ జవాబు చెప్పలేదు. చూట్టూ చూసాను. ఇల్లంతా చక్కగా సర్ది వుంది. విశాలమైన గదులు.

"మీ ఇల్లు బాగుంది" చెప్పాను.

"అమ్మా వాళ్ళింట్లో సగం కూడా లేదు" వెంటనే చెప్పింది.

ఆ మాటకి ఏం చెప్పాలో తెలియక అడిగాను.

"మరిదిగారేరి? కాలేజ్‌నించి ఇంకా రాలేదా?"

"ఎప్పుడూ ఆ లేబ్‌లోనే పడి ఏడుస్తూంటాడు. వస్తాడ్లే నువ్వు చెప్పు. ఏంటి విశేషాలు?" ప్రతిమ నా పక్కన కూర్చుంటూ అడిగింది.

"ఏముంటాయి నాకు, నువ్వే చెప్పాలి" బలవంతంగా నవ్వాను.

"మీ అబ్బాయి బాగున్నాడు. యు.ఎస్ సిటిజెన్ కదా?" వాడి వేళ్ళతో ఆడుకుంటూ అడిగింది.

"అవును."

"లక్కీ ఫెలో. నీకు నా ఫ్రెండ్ దీపిక తెలుసుకదా? అదిప్పుడు యు.ఎస్‌లోనే ఉంది. మాలతి డాక్టర్‌ని చేసుకుంది. వాళ్ళు సౌదీ వెళ్ళడానికి ట్రై చేస్తున్నారు. శ్రీలత పోలీస్ ఆఫీసర్ని చేసుకుంది. నాన్న నాక్కూడా ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్‌లని చూస్తా' అనేవారు."

ప్రతిమ మాటల్లో దాని అసంతృప్తి బయటపడింది.

"సాత్యకిగారు ఎలా ఉన్నారు? సైన్స్ మేగ్‌జైన్స్‌కి ఆర్టికల్స్ రాస్తారుటగా? పిన్ని చెప్పింది. 'చాలా మంచబ్బాయి. ప్రతిమ మాటకి ఎదురు చెప్పడు' అనికూడా చెప్పింది. పెళ్ళయి మూడేళ్ళయిందిగా పిల్లల్ని ప్లాన్ చేస్తున్నారా?" అడిగాను.

ప్రతిమ ముఖం కోపంతో ఎర్రబడింది.

"నా మొహానికి పిల్లలే తక్కువ. ఎందుకు ఇంకో బడుద్దాయ్‌ని కని ఆడపిల్ల ఉసురుపోసుకోవడం."

"ఏం మాటలు ప్రతిమా?" అప్రయత్నంగా అన్నాను.

"నీకేం. సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌ని చేసుకున్నావ్. ఇవాళ ఇండియాలో ఉంటే రేపు ఆస్ట్రేలియాలో ఉంటావు. బావ ఎంత సరదాగా ఉంటాడు? మా బుద్ధావతారం పది మాటలకి రెండు మాటలు కూడా బదులు మాట్లాడడు. అదేమంటే, దెయ్యం కళ్ళేసుకుని చూస్తాడు తప్ప రెస్పాన్స్ ఉండదు. పొద్దస్తమానం రీసర్చ్, రీసర్చ్ అంతే. ఏదో నోబుల్ ప్రైజ్‌కి కష్టపడినట్లు పడతాడు. ఓ సరసం లేదు. సరదా లేదు. ఇంకో ఊరికి మారదాం. విసుగ్గా ఉంది అంటే, ఈ కాలేజ్ లేబ్ ది బెస్ట్. రాను అంటాడు. ఇక్కడే పుట్టా, ఇక్కడే పెరిగా. రేపు ఇక్కడే చావాలి. మనిషికి మార్పు కావాలి." ప్రతిమ ఆవేశంగా అరిచింది.

"అమ్మ వాళ్ళింటికి నాలిగిళ్ళ అవతల ఉండటం ఎంత అదృష్టం అన్నావు?"

"నువ్వు దెప్పిపొడవక్కర్లా. నాకేం తెలుసు? ఏదో మనిషి రూపం చూసి ఇష్టపడ్డాననుకో. అమ్మా నాన్న నా కాళ్ళు విరగ్గొట్టి వేరే మంచబ్బాయితో పెళ్ళిచేయచ్చుగా? సరేనని ఇంతోటి సంబంధం చేసారు. అందుకే అమ్మని చూసినా నాకు ఒళ్ళు మండుతోంది."

"నువ్వు అతని రూపం గురించి నాకు చెప్పలేదు. జీసస్‌లా చూసారు. బుద్దుడిలాంటి ప్రేమ కురిపించే కళ్ళు అని మాత్రమే చెప్పావు. తెలివితేటలు, మేధస్సుని చూసి ఇష్టపడ్డానని చెప్పావు. సాత్యకి రీసెర్చ్‌ని చూసి మోజు పడి పెళ్ళి చేసుకుని ఇప్పుడు లేబ్‌లో పడి ఏడుస్తాడు అంటావేం? తప్పుకదా? ఏమో నోబుల్ ప్రైజ్ సాధిస్తాడేమో?"

"వాడికంత లేదులే. మునిగి తేలితే కానీ లోతు తెలియదు. నాన్న అందలం ఎక్కిస్తానంటే వద్దని ఊబిలో మునిగా" కసిగా చెప్పింది.

"సరే ప్రతిమా. వెళ్తాను అమ్మ ఎదురు చూస్తుంటుంది" లేచాను.

"రేపు పెద్దమ్మని తీసుకురా. భోజనానికి ఉండండి. మా బుద్ధావతారంకి త్వరగా రమ్మని చెప్తా" ప్రతిమ లేచి నిలబడింది.

నేను బయిటకి వస్తూంటే, లోపలకి వస్తున్న సాత్యకి కనిపించాడు.

అతను ఏమీ మారలేదు. తన పెద్ద కళ్ళతో అభిమానంగా చూస్తూ పలకరించాడు.

"బాగున్నారా? బాబు చక్కగా ఉన్నాడు. పేరేం పెట్టారు? అప్పుడే వెళ్ళిపోతున్నారా?"

అతనికి సమాధానాలు చెప్పి పిన్ని వాళ్ళింటివైపు నడిచాను.

పెళ్ళికి ముందు ప్రతిమ ఆ వ్యక్తిని ఎంత ఉన్నతంగా ఊహించిందో, ప్రేమించిందో, అదే మనిషితో పెళ్ళవగానే బడుద్దాయ్, బుద్ధావతారంగా మారిపోయాడు. సార్ ఏకవచనంలోకి దిగిపోయాడు. బుద్దుడికళ్ళూ, దెయ్యం కళ్ళయిపోయాయి. గారు కాస్త వాడుగా మారింది.

ఒక మనిషి గొప్పతనాన్ని ఆరాధిస్తూంటే అతనితో పరిచయం పెంచుకోకూడదు. ఎప్పుడైతే దగ్గరవుతాడో అప్పుడు విలువ ఉండదు. కొండ గొప్పతనం చూడాలంటే దూరం నించే చూడాలి. దగ్గరగా చూస్తే శిఖరం కనిపించదు.

జీవితంలో పెళ్ళి చేసుకోకూడదు అనుకున్న సాత్యకిని తలచుకుంటే జాలేసింది. నాకు మళ్ళీ ప్రతిమని కలవాలి అనిపించలేదు.

Click here to share your comments

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*